ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





గ్రామాలకు రక్షణ కరువు

◆ వరహా, శారద, తాండవ నదుల వరదలకు తరచూ ముంపు
◆ నష్టపోతున్న ప్రజలు ◆ హామీలకే పరిమితమైన గోడలు



వరద ముంపునకు గురైన ఓ గ్రామం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

శారద, వరహా, తాండవ నదుల రక్షణ గోడలు హామీ నెరవేరలేదు. ఈ నదులకు ఆనుకొనివున్న గ్రామాలకు వరద, తుపానుల ముంపు నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామని ఇచ్చిన మాటను ఏ ప్రభుత్వమూ నెరవేర్చడంలేదు. చిన్నపాటి తుపాను, వరదలొచ్చినా లోతట్టు గ్రామాలు, వందలాది ఎకరాల పంట పొలాలు మునిగిపోతున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పుడు నదులు ఉధృతంగా ప్రవహించినన్ని రోజులూ కంటి మీద కునుకులేకుండా గడపడం లోతట్టు ప్రాంత ప్రజలకు అలవాటుగా మారింది. 2012 నవంబరులో నీలం తుపాను మిగిల్చిన గాయాన్ని ఇప్పటికీ బాధిత గ్రామ ప్రజలు మర్చిపోవడంలేదు. నీలం తుపానుకు కురిసిన భారీ వర్షాలతో తీవ్ర నష్టం సంభవించింది. వరద ఉధృతికి పశువులు కొట్టుకుపోయాయి. అనేక గ్రామాల్లో నీరు చేరింది. వరద తీవ్రతను పరిశీలించడానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వరహా, శారదకు రెండువైపులా ముంపు గ్రామాల వద్ద శాశ్వత రక్షణ గోడలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ పునరుద్ధరణ పనులకు రూ.24 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారుగానీ నిధులు విడుదల చేయలేదు. నీటిపారుదల శాఖాధికారులు అప్పట్లో శారద, వరహా నదుల వరద సమస్య శాశ్వత పరిష్కార నిమిత్తం రూ.110 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రతిపాదనలు పట్టాలెక్కు తాయనుకున్న కాలంలో రాష్ట్ర విభజన జరగడంతో అవన్నీ పక్కకు వెళ్లాయి. తరువాత టిడిపి, వైసిపి ప్రభుత్వం వచ్చినా నదులకు సమీపంలోని ముంపు గ్రామాలను పట్టించుకోలేదు. ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు నాయుడు సోముదేవుపల్లి గట్టును మిగతా 2లో..



గాజువాకలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

పలుచోట్ల సంతాప సభలు వార్తలు 8లో..

సిఎం సహాయ నిధికి విశాఖ పోర్టు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంత ప్రజల సహాయార్థం విశాఖపట్నం పోర్టు అథారిటీ కోటి రూపాయలను విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైనపుడు సహాయ సహకారాలు అందించడంలో విశాఖ పోర్ట్ యాజమాన్యం, సిబ్బంది ఎప్పడూ ముందు వరుసలో ఉంటారన్నారు. విజయవాడ వరదలకు సంబంధించి ఈ నెల 9న పోర్ట్ కార్మిక సంఘాలు, అధికారుల సంఘాలతో చర్చించి వరద బాధితుల మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండి వైఖరి తగదు

▶ వార్త 2లో..

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

▶ వార్త 2లో..

ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు 16 నుంచి సిపిఎం బైక్‌యాత్ర

▶ వార్త 5లో..



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హరివెంకట కుమారి

పలు అభివృద్ధి పనులకు

జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం

◆ 280 అంశాలతో అజెండా ◆ 152పై చర్చ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం శుక్రవారం ఆమోదం తెలిపింది. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన స్థాయీ సంఘం సభ్యులు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావు, పిసిని వరాహ లక్ష్మీనరసింహం, గల్లా పోలిపల్లి, బొమ్మిడి రమణ, బల్ల శ్రీనివాసరావు, శరగడం రాజశేఖర్, నొల్లి నూకరత్నం, పులి లక్ష్మీబాయి, పిళ్లా మంగమ్మలతో స్థాయీ సంఘ సమావేశాన్ని చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 280 అంశాలతో కూడిన అజెండాను పొందుపరచగా 152 అంశాలపై చర్చ జరిగినట్టు మిగతా 2లో..

ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన

రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలి

బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ బ్యాంకుల అధికారులను ఆదేశించారు. తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 8, 9 తేదీలలో జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల మంజూరుపై ప్రత్యేక జిల్లా సలహాదారు కమిటీ సమావేశం (స్పెషల్ డిసిసి) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల పద్మనాభం, పెందుర్తి మండలాల్లోగల 31 మంది రైతులకు చెందిన 7.84 హెక్టార్ల వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వ్యవసాయాధికారి చెప్పారన్నారు. ఆ రైతులందరికీ వ్యవసాయ రుణాలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించి రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, లేని వారికి కొత్త రుణాలను మంజూరు చేయాలని అన్నారు. కాకాని నగర్, కె.నగరంపాలెం ప్రాంతాల్లో మరణించిన పశువుల స్థానంలో కొత్త పశువులు కొనుగోలు చేసుకునేలా రుణాలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గ్రామాలకు రక్షణ కరువు

పరిశీలించారు. తరువాత ముఖ్యమంత్రి హోదాలో అనకాపల్లి మండలం రేబాక వచ్చినప్పుడు ప్రస్తుత హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో అఖిలపక్ష పార్టీల నాయకులు శాశ్వత రక్షణ గోడలు నిర్మించాలని వినతిపత్రం ఇచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

నీలం తుపానుకు అనకాపల్లి వద్ద దెబ్బతిన్న పులిగెడ్డ గట్టు, వరహా నది ప్రవాహంతో దెబ్బతిన్న ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి గట్టు తాత్కాలిక పనులకు ప్రభుత్వం పరిమితమైందేగానీ శాశ్వత రక్షణ గోడలు నిర్మిస్తామని ఇచ్చిన మాటను అమలుచేయలేదు. ముంపు సమస్యను పరిగణనలోకి తీసుకొని వరహా, శారద వలె తాండవ నది లోతట్టు గ్రామాల్లోకి వరదనీరు రాకుండా రక్షణ గోడల నిర్మాణం కోసం ప్రభుత్వానికి రూ.50 కోట్లతో నివేదిక పంపించారు. అయితే ఇంతవరకు శారద, వరహా, తాండవ నదుల సమీప ముంపు ప్రాంతాలకు వరద సమస్య నుంచి శాశ్వత పరిష్కారం దొరకలేదు. ప్రతిపాదిత పనులను నీటిపారుదల శాఖాధికారులు గుర్తుచేసిన ప్రతిసారీ ప్రాధాన్యతలు, నిధుల సమస్య చెప్పి ప్రభుత్వాలు తప్పించుకోవడం మినహా నిధులు విడుదలచేసిన పాపానపోలేదు. వరదలు వచ్చినప్పుడు పరామర్శలు, పరిశీలనలేగానీ ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయడంలేదు. సోముదేవుపల్లి రైల్వే బ్రిడ్జి దగ్గర నుంచి సముద్రంలో వరహా నీరు కలిసే వరకు రెండు వైపులా రక్షణ గోడ నిర్మిస్తే ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాలు వరద ఉధృతి ప్రమాదం నుంచి బయటపడతాయి. కూటమి ప్రభుత్వమైనా భవిష్యత్తులో వరద ప్రమాదాలకు ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శాశ్వత రక్షణ గోడలు నిర్మించాలని లోతట్టు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడలే పరిష్కారం

నదుల వరద ప్రమాదాలు పునరావృతం కాకుండా వరహా, శారద, తాండవకు రెండువైపులా శాశ్వత రక్షణ గోడలు నిర్మించాలి. నదులకు రెండువైపులా గోడ నిర్మాణ విషయమై పరిశీలిస్తామని అప్పట్లో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలుచేయాలి. ప్రమాదం జరగకముందే ముందస్తు చర్యలు తీసుకొని, ప్రజలు ప్రమాదం బారినపడకుండా చూడాలి.

ఎం.అప్పలరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలి

మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే నష్టపోయిన మత్స్యకారులకు కూడా రుణాలను మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని తెలిపారు. తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఆర్‌బిఐ సూచనల మేరకు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టాలను అంచనా వేసి ఆర్థికంగా ఆదుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎం.ఎస్.శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, మత్స్య శాఖ జెడి జి.విజయ, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ డి.రామకృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం

తెలిపారు. విజయవాడ వరద సహాయక కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొనడంతో వారు అందుబాటులో లేనందున 50 అంశాలను వాయిదా వేశామన్నారు. 102 అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారని, మిగిలిన 128 అంశాలను సమయాభావం వల్ల ఈ నెల 17కి వాయిదా వేశామని వెల్లడించారు. సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, హేమావతి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్, రెడ్డి చిరంజీవి, సహాయక వైద్యాధికారులు డాక్టర్ సునీల్ కుమార్, అప్పలనాయుడు, కృష్ణంరాజు, ప్రసాదరావు, బయాలజిస్ట్ సాంబమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.పద్మజ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు వంశీకృష్ణ, భరణి కుమార్, శ్రీనివాస్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న విశాఖ పోర్టు అధికారులు

సిఎం సహాయ నిధికి విశాఖ పోర్టు రూ.కోటి విరాళం

కోసం ఒక రోజు వేతనాన్ని సిఎం సహాయ నిధికి అందించాలని నిర్ణయించామన్నారు. కార్మిక సంఘాలు ఒక రోజు బేసిక్ వేతనాన్ని విరాళంగా ఇవ్వడానికి అంగీకరించగా, అధికారుల సంఘం ఒక రోజు బేసిక్ వేతనం, ఒక రోజు డిఎ ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. రూ.45,81,770ను సిబ్బంది, అధికారుల నుంచి, రూ.54,18,230ను సిఎస్ఆర్ నిధి నుంచి వెరసి మొత్తం కోటి రూపాయలను సిఎం సహాయనిధికి అందించేందుకు పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆమోదం తెలిపారన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఎంవిపి.కాలనీలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లు సంయుక్తంగా పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాత్రపై అవగాహనా కార్యక్రమం చేపట్టాయి. స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్.వరలక్ష్మి అధ్యక్షత వహించారు. విద్యార్థుల ఫిర్యాదుల బాక్స్‌ను విద్యార్థినుల చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



కార్యక్రమంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

అనంతరం జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి అప్పారావు, సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బాలల హక్కుల పరిరక్షణలో బాధ్యతతో కూడిన కీలక పాత్రధారులు, సూత్రధారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ కమిషన్‌కి అందుతున్న ఫిర్యాదుల్లో ఉపాధ్యాయులు, స్కూల్ వాచ్‌మ్యాన్లు, డ్రైవర్లు, కండక్టర్లు తదితర సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉంటున్నాయన్నారు. వీటిని ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు సిబ్బంది నియామకాలు జరిపేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. అందరూ ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి బాలామణి, అర్బన్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత, శ్రీ సత్య సాయి విద్యా విహార్ స్కూల్ గవర్నింగ్ బాడీ సభ్యులు పిఆర్ఎస్ఎన్.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వై.వి.రవి కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండి వైఖరి తగదు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండి వైఖరి తగదని, తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1310వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలమన్నారు. కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

కర్మాగారంలో ఉత్పత్తి జరగనివ్వకుండా తీవ్ర నష్టాల్లోకి నెట్టాలని మోడీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మాట్లాడిన నాయకులంతా మరోసారి గట్టిగా గళం విప్పి కార్మికుల పక్షాన నిలవాలని కోరారు.

ఎంవిపి.కాలనీ సిఐగా మురళి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ సిఐగా జె.మురళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1998వ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో విశాఖ సిటీ పరిధిలోని పెందుర్తి, ఎయిర్‌పోర్టు తదితర స్టేషన్లలో పని చేశారు. తాజాగా విజయనగరం డిసిఆర్‌బి నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజల సహకారంతో ఏదైనా సాధ్యమని అన్నారు.

పారా షూటింగ్ పోటీల్లో సత్తా చాటండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా బీచ్ రోడ్డులోని వైఎంసిఎలో ఈ నెల 29న ప్రారంభం కానున్న 3వ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల పోస్టర్‌ను విశాఖపట్నం జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీలత శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పోటీల్లో అందరూ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంత క్రీడాకారులు ఈ నెల 25లోపు 7095811456, 9390131777 నెంబర్లను సంప్రదించి వెంటనే పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి కోరారు. కార్యక్రమంలో పారా షూటింగ్ రాష్ట్ర కన్వీనర్ ఆవల రమేష్, పికె.జోష్, శీతల్ మదన్, షూటింగ్ కోచ్ మల్లేష్, షేక్ గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల బ్యాట్లు పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్‌లోని శ్రీ స్వామి వివేకానంద సంస్థలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఛైర్మన్ మక్సుద్ అహ్మద్ వివేకానంద అనాథాశ్రమంలో ఆశ్రమ వాసులతో పాటు, చుట్టు పక్కల పేద ప్రజలకు దోమల బ్యాట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి, సుజాత, రాణి, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

'ఫెస్టివల్ ఆఫ్ కార్స్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమోటివ్ తయారీదారు టాటా మోటార్స్ ఈ పండగ సీజన్ కోసం ఆఫర్లతో 'ఫెస్టివల్ ఆఫ్ కార్స్'ని ప్రారంభించింది. ఈ సందర్భంగా మద్దిలపాలెంలోని టాటా మోటార్స్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఫెస్టివల్ ఆఫ్ కార్స్ టాటా ప్యాసింజర్ ఎలక్ట్రికల్ మొబిలిటీ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవత్సవ మాట్లాడుతూ కస్టమర్లు తమ షోరూమ్‌లలో గరిష్టంగా రూ.2.05 లక్షల వరకు సంచిత ప్రయోజనాలను పొందవచ్చునని తెలిపారు. దానితో పాటు అనేక ప్రసిద్ధ కార్లు ఎస్‌యువిల కోసం మునుపెన్నడూ చూడని ధరలను పొందవచ్చునన్నారు.

ప్రైవేటు బస్సుల పార్కింగ్‌గా ప్రధాన రోడ్డు

రాకపోకలకు ఇక్కట్లు



అంబేద్కర్ భవనం ఎదురుగా రోడ్డుపై నిలిపిన బస్సులు

- అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని రామటాకీస్ ప్రాంతంలో రాకపోకలకు పాదచారులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. అంబేద్కర్ భవనం ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా భారీ బస్సులు నిలిపివేయడంతో, అటుగా వెళ్లాలంటే నానాయాతన పడక తప్పని స్థితి. ప్రధాన రహదారి కావడం, పెద్దసంఖ్యలో వాహన రాకపోకలు ఉండే ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా బస్సులను నిలిపేయడంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారి తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనిపై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు, జివిఎంసి అధికారులకు వాహనదారులు, స్థానికుల మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మార్గంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలతోపాటు , జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం బుల్లయ్య కాలేజీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంచ ప్రధానంగా కాంప్లెక్స్‌కు వెళ్లే వాహనాలకు ప్రధాన మార్గం కావడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోడ్డుకిరుపక్కలా బస్సులు నిలిపివేయడంతో హాస్పిటల్‌కు వెళ్లే రోగులు, వృద్ధులతోపాటు కాలేజీ విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు

ఎక్కడైనా రాంగ్ పార్కింగ్‌లోబైక్‌లు, కార్లను నిలిపితే ఆగమేఘాల మీద ఫోటోలు తీసి, జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, ఇక్కడ అడ్డగోలుగా రోడ్డుపక్కనే 10 నుండి 15 వరకు బస్సుల వరకు నిలివేస్తున్నా, వాటివైపు కన్నెత్తి చూడకపోవడం, ఎటువంటి చర్యలు చేపట్టకపోడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బస్సులు అడ్డుగా ఉండడంతో, ఇక్కడ రోడ్డు దాటాలన్నా, ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక ప్రమాద బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, జివిఎంసి అధికారులు స్పందించి, రోడ్డుపై నిలిపివేస్తున్న బస్సుల వల్ల కలిగే ఇక్కట్లు నుంచి విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా వన మహోత్సవం


ఎన్ఎస్ఆర్ఐటిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం: సొంత్యాంలోని నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. .ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ హితానికి సహకరించాలని కోరారు.మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన, పోస్టర్ ప్రెజెంటేషన్, ప్యానెల్ డిస్కషన్స్, ఎకో వాక్, సెమినార్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ పిఒ హరగోపాల్, పి.డిల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో శుక్రవారం 150 వివిధరకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ షరీఫ్, పాఠశాల హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, పిఇటి రమేష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐగా వాసునాయుడు


సిఐ వాసునాయుడు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చింతా వాసునాయుడు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో అల్లూరి జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్కఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న వాసునాయుడును ఆనందపురం సిఐగా నియమించారు. గతంలో మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనూ, భీమిలి, సిటీ టాస్కఫోర్స్‌లో ఎస్ఐగా పనిచేసిన వాసునాయుడు ప్రమోషన్‌పై సిఐగా శ్రీకాకుళం సిసిఎస్‌లో పనిచేశారు.అక్కడి నుంచి అల్లూరు జిల్లా ఎండిపిఎస్ టాస్కఫోర్స్ విభాగంలో సీఐగా పనిచేసి, ఇపుడు ఆనందపురం సిఐగా విధుల్లో చేరారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్కిల్‌పరిధిలో నేరాల రేటు పెరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తానన్నారు. స్థానిక ఎస్ఐలు గంట్యాడ సంతోష్, పందిరి శివ, రైటర్ గాంధీ, ప్రజాప్రతినిధులు కొత్త సిఐకి శుభాకాంక్షలు తెలిపారు.కాగా ఇక్కడ సిఐగా పనిచేసిన టివి.తిరుపతిరావు విశాఖ రేంజ్ విఆర్‌కు బదిలీపై వెళ్లారు.

ఔషధ ప్రయోగాలకు ప్రత్యామ్నాయం అవసరం

గీతం ఫార్మశీ వర్క్‌షాప్‌లో నిపుణుల సూచన



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కులకర్ణి

ప్రజాశక్తి- మధురవాడ : కృత్రిమ మేధ, కంప్యూటర్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత కాలంలో ఔషధ పరిశోధనలకు జంతువులను ఉపయోగించడం కంటే ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలని వ్యాస్ కేన్సర్ రీసెర్చి పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మందర్ కులకర్ణి సూచించారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ జంతువులపై ప్రయోగాలకు ప్రస్తుత కాలంలో సామాజిక వ్యతిరేకత ఉందని, దీని దృష్ట్యా నైతిక విలువలను పాటిస్తూ శాస్త్ర పరిశోధనలు జరగాలన్నారు. జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఔషధ ప్రయోగాలకు జంతువులకు ప్రత్యామ్నాయం లేదని, పరిశోధన ఫలితాలకు జంతువులను వాడే సమయంలో విధిగా నిబంధనలను పాటించాలని, నైపుణ్యాలతో వ్యవహరించాలని సూచించారు. భారత ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ సీనియర్ నిపుణులు డాక్టర్ వివేక్ త్యాగి మాట్లాడుతూ దేశంలో ఔషధ పరిశోధనల సంఖ్య క్రమేపి పెరుగుతోందని, ఏటా దాదాపు 600 పెద్ద జంతువులపై ప్రయోగాలకు పరిశోధకులు అనుమతులు పొందుతున్నారన్నారు. జంతువులపై ఔషధ ప్రయోగాలు జరిపే సమయంలో వాటి సంరక్షణ సరిగా లేకుంటే అవి తీవ్ర ఒత్తిళ్లకు గురవుతాయని, పరిశోధన ఫలితాలలో ఆ మార్పు కనబడుతుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గీతం ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ జి.సుహాసిన్ పాల్గొన్నారు. దేశంలోని ప్రముఖ పరిశోధన కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.హరిశంకర్, డాక్టర్ ఎమ్.జె.మహేష్‌కుమార్, డాక్టర్ ప్రాంజలి మిలింద్ పోర్ పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు.

ముందస్తు జాగ్రత్తలతో తెగుళ్ల నివారణ


కాపులుప్పాడలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఎఒ శివకోమలి

ప్రజాశక్తి-ఆనందపురం/ భీమిలి: ముందస్తు జాగ్రత్తలతో ఇటీవల వర్షాలతో వరిపైర్లకు సోకిన ఆకు ముడత, తెల్ల చిత్త, పాముపొడ వంటి తెగుళ్లు, చీడపీడలను నివారించవచ్చని ఆనందపురం, భీమిలి మండల వ్యవసాయాధికారులు సంధ్యా రత్నప్రభ, బి.శివకోమలి సూచించారు. ఈ మేరకు తమ మండలాల పరిధిలోని పంటపొలాలను పరిశీలించారు. ఆనందపురం మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1490 ఎకరాలలో, అలాగే భీమిలిలో 1245 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం నమోదైందన్నారు. భీమిలి మండలంలోని కాపులుప్పాడ, కల్లివానిపాలెం గ్రామాల్లో వరి పొలాలను శుక్ర వారం ఎఒ శివకోమలి పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు బారినపడి, తేరుకున్న పైర్లకు వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ చల్లుకోవాలన్నారు. 20 రోజులు లోపు వయస్సున్న పైర్లకు ఎకరానికి 500 మిల్లీలీటర్ల వేపనూనె పిచికారీ చేస్తే ఆకు ముడత, సుడిదోమను అరికట్టవచ్చు నన్నారు. ఆకుముడత, తెల్ల చిత్త ఆశించిన వరిపొలాల్లో దుబ్బులో ఆకులు నిలువునా ముడుచుకుని, తెల్లని చారలు కనిపిస్తాయన్నారు. లక్షణాలు గుర్తించిన వెంటనే ఎకరానికి 400 గ్రాములు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చెయ్యాలన్నారు. వరి పొలాల్లో అక్కడక్కడా పాము పొడ తెగులు గమనించామని, దాని నివారణకు హెక్సాకొనజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

ప్రతిఒక్కరూ సచివాలయ సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు

నేరాలు ఘోరాలు

సంజయ్‌గాంధీ కాలనీలో చోరీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి తొమ్మిదో వార్డు కొండవాలు ప్రాంతమైన సంజయ్‌గాంధీ కాలనీ, షిరిడీ సాయిబాబా ఆలయం వెనుక ఒక నివాసంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. సిహెచ్.అప్పారావు, బమ్మిడి శ్రీను అన్నదమ్ములు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం పనుల నిమిత్తం బయటకు వెళ్ళారు. ఇంటి తాళాం కిటికీ వద్ద పెట్టి వెళ్ళడంతో వాటిని గమనించిన వ్యక్తులు బుధవారం మధ్యాహ్నం ఇంటి తాళాలు తీసుకొని ఇంట్లో ఉన్న సుమారు 10 తులాల బంగారు నగలు, రూ 10వేలు నగదు అపహరించినట్టు ఇంటి యజమానులు గుర్తించారు. దీనితో బాధితులు ఆరిలోవ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. గురువారం క్రైమ్ ఎసిపి వెంకటరావు, సిఐ బంగారు పాప ఇంటిని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

ఐహెచ్ఆర్‌సి ఇన్‌ఛార్జిగా మేజర్ ఉషాదేవి



ఉషాదేవికి నియామకపత్రం అందజేస్తున్న రాజాన

ప్రజాశక్తి- వేపగుంట : ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ (ఐహెచ్ఆర్‌సి) ఆంధ్రా, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆర్మీ మెడికల్ సర్వీస్ మాజీ మేజర్ పి ఉషాదేవి నియమితులయ్యారు. శుక్రవారం జివిఎంసి:93వ వార్డు కృష్ణానగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు మేజర్ ఉషాదేవికి సంస్థ వ్యవస్థాపక జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు నియామకపత్రం, గుర్తింపుకార్డు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, ఆర్మీ మెడికల్‌లో సేవలు అందించిన ఉషాదేవి, ఇపుడు సంస్థ తరపున ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో పనిచేయాలని, మానవహక్కుల పరిరక్షణకు కీషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ రవివర్మ, కన్వీనర్ పి మురళి ట్రెజరర్ ఆర్ విజయ, సెక్రటరీ ఇషిత, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ జి శ్రీనివాస్, జిల్లా మహిళాధ్యక్షురాలు పి హేమలత, ఉమాదేవి పాల్గొన్నారు

17న నులి పురుగుల నిర్మూలన దినం

ప్రజాశక్తి- ఆనందపురం: జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఈనెల 17న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీల్లోని పిల్లలకు నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలను మింగించనున్నట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు తెలిపారు. ఈ మేరకు 16424 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వీరందరికీ ఆ రోజున మధ్యాహ్న భోజనం అనంతరం అరగంట తర్వాత మాత్రలు నమిలి, మింగించనున్నారని, మిగిలిన వారికి 25న వేయిస్తారన్నారు. ఈ విడతలో గర్భిణులకు కూడా ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- తగరపువలస : 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై చిట్టివలస జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, నియంత్రణకు తీసుకోవసిన జాగ్రత్తలు సిఎల్‌డబ్ల్యు ఎం జ్యోతి వివరించారు. హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు, ఎఎన్ఎం గ్లోరీ పాల్గొన్నారు

కురిసిన వర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో కొండవాలు ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. రెండ్రోజులుగా తెరిపిచ్చిన వర్షంతో ఒకింత ఊపిరి పీల్చుకున్న సమయంలో మళ్ళీ వర్షం కురవడంతో ఆందోళన నెలకొంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- వేపగుంట :జివిఎంసి 93వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా సాయిమాధవ్ నగర్ పార్కును సందర్శించారు. పార్కును అనుకొని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, కృష్ణానగర్‌లో రూ.31.55 లక్షలతో హోమియోపతి ఆసుపత్రి, రూ.11.14 లక్షలతో సిసిరోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రహ్లాదపురం కమ్యూనిటీ హాల్‌లో 13 పొదుపు సంఘాలకు రూ.86.70 లక్షల రుణాలను పంపిణీ చేశారు. బాలాజీ గార్డెన్, ప్రహ్లాదపురం, గణేష్ కాలనీల్లో వినాయక మండపాలను కాలనీ పెద్దల ఆహ్వానం మేరకు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రతి సమస్య తనకు తెలుసునని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా, జోనల్ కమిషనర్ హేమావతి, స్థానిక నాయకులు ఎర్ర నాగరాజు, కిషోర్ గొంతెన ప్రకాష్ పాల్గొన్నారు

సమస్యలపై ఆటో కార్మికుల వినతి



ఎమ్మెల్యే గణబాబుకు సమస్యలు చెబుతున్న ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి -గోపాలపట్నం : తమ సమస్యలను పరిష్కరించాలని గోపాలపట్నం ప్రాంత ఆటో కార్మికులు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబును అతని క్యాంపు కార్యాలయంలో కలిసి, సమస్యలను విన్నవించారు. యూనిఫారం వేసుకున్నా, వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు ఉన్నప్పటికీ, పోలీసులు కేసులు నమోదు చేసి, అధిక మొత్తంలో చలానాలు వేస్తున్నారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు



నిత్యావసరాలు ఇస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -సీతమ్మధార : బుడమేరు వరద విలయంలో అతలాకుతలమైన విజయవాడలో సహాయక చర్యలు చేపట్టేందుకు వెళ్లి తిరిగొచ్చిన జివిఎంసి 44వ వార్డుకు చెందిన 15 మంది పారిశుధ్య కార్మికులకు స్థానిక వార్డు కార్పొరేటర్, వైసిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ బాఢాల శ్రీనివాసరావు 15 మందికి ఎనిమిది రకాల నిత్యావసర సరుకులు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్ట సమయంలో ఆదుకునేందుకు వెళ్లి, తమ సేవలను సమర్ధవంతంగా నిర్వర్తించి తిరిగొచ్చిన పారిశుధ్య కార్మికులను అభినందించారు.

ఆశాజనకంగా ఖరీఫ్!

- అనుకూల వర్షాలతో పెరిగిన సాగు విస్తీర్ణం
- పిలకలు తొడిగే దశలో వరి పైర్లు
- నీటిముంపుతో పొంచి ఉన్న తెగుళ్ల బెడద



తాటితూరులో పిలకలు తొడిగే దశలో వరి పంట

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రధానపంట వరిపైర్లు ప్రస్తుతానికి ఆశాజనకంగానే ఉన్నాయి. ఈ నెల 15 నాటికి ఖరీఫ్ సీజన్ ముగియనున్న నేపథ్యంలో మొదట్లో ప్రతికూలించినా, తర్వాత సానుకూల వర్షాలతో వరి సాగు గణనీయంగా పెరిగి, పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ఖరీఫ్ తొలిరోజుల్లో జూన్‌లో వ్యవసాయబోర్లున్న చోట కేవలం 10 శాతం మాత్రమే వరినాట్లు పడ్డాయి. జూలై రెండో వారంలో వర్షాలు అనుకూలించడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు సానుకూలంగా పడడంతో సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. భీమిలి డివిజన్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 9, 317 ఎకరాలకు గాను 8,868 ఎకరాల్లో నాట్లు వేశారు ప్రస్తుతం కురిసిన వర్షాలకు భీమిలి మండలంలో దాకమర్రి, మజ్జివలస, మజ్జిపేట, సింగన బంద, ఆనందపురం మండలం గండిగుండం, పాలవలస, సొంత్యాం, పద్మనాభం మండలం బిఆర్ తాళ్లవలస, ఐనాడ, రేవిడి, గంధవరం, పెంట, కొవ్వాడ తదితర గ్రామాల్లో నార్లు వేసేందుకు వీలుగా అనుకూల వాతావరణం ఏర్పడింది.

ఈనెలలో ఎడతెరిపిలేని వర్షాలకు భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో దాదాపు 50 ఎకరాల్లో పిలకల దశలో ఉన్న వరి పంట నీట మునిగింది. అయితే ముంపునీరు వెంటనే తొలగి పోవడంతో పంటకు నష్టం వాటిల్ల లేదని, అయితే తెగుళ్ల ఆశించాయని రైతులు అంటున్నారు.

మండలాల వారీగా వరిసాగు విస్తీర్ణం

భీమిలి మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1218 ఎకరాలకు గాను 1232 ఎకరాల్లో, ఆనందపురంలో 1472 ఎకరాలకు గాను 1476 ఎకరాల్లో సాధారణ కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరినాట్లు పడగా, పద్మనాభం మండలంలో 6,627 ఎకరాలకు గాను, 6160 ఎకరాల్లో వరినాట్లు వేశారు. తాజా వర్షాలతో మిగిలిన 449 ఎకరాల్లో నార్లు వేసే అవకాశం ఏర్పడింది.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వర్షాలతో వరిపైర్లకు ఆకు ముడత, పొడ తెగులు ఆశించిన నేపథ్యంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఆకు ముడత, పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు మందును లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలి. అలాగే అదే సమయంలో లీటరు వేపనూనె 1500 పిపిఎం కలిపి పిచికారీ చేయాలి.

బొడ్డేపల్లి విజయ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్
వ్యవసాయ శాఖ, భీమిలి డివిజన్

పద్మనాభం మండలంలోనే పంట నష్టం

ఇటీవల వర్షాలకు పద్మనాభం మండలం బాందేవుపురంలోనే 12 మంది రైతులకు చెందిన 10ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి విజయప్రసాద్ తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబర్‌లో నమోదైన వర్షపాతం ఇలా...

ఆగస్టు నెలలో భీమిలి మండలంలో 176 మిల్లీమీటర్లకు గాను 147 మిల్లీమీటర్లు, ఆనందపురంలో 183.5 మిల్లీ మీటర్లకు గాను 173.1 మిల్లీమీటర్లు, పద్మనాభంలో 263.4 మిల్లీమీటర్లకు గాను 162.4 మిల్లీ మీటర్లు సాధారణం కంటే తక్కువ వర్ష పాతం నమోదైంది. ఈ నెలలో 8,9, 10 తేదీల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో వరిపంటకు ప్రయోజనకరంగా ఉందని రైతులు, వ్యవసాయాధికారులు అంటున్నారు.

ఆశించిన చీడ పీడలు..

వర్షాలు కురిసిన నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో వరి పంటకు తెల్ల చిత్త (ఆకుముడత),పొడ తెగులు ఆశించినట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

ఆదర్శలో మెగా జాబ్ మేళా

వివిధ ఉద్యోగాలకు 56 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి- పెందుర్తి: స్థానిక ఆదర్శ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 56 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ ఆదర్శ డిగ్రీ కాలేజీలో ప్రతి నెలా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని యువత ఉపయోగించు కోవాలన్నారు. ప్రస్తుత జాబ్‌మేళాలో డిగ్రీ ఫైనలియర్ ఐదవ సెమిస్టర్ విద్యార్థులు 50 మంది ఎంపిక య్యారన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.25వేల ప్రారంభ నెలసరి వేతనంలో ఉద్యోగంలో చేరి, మూడు నెలల ప్రొబెషనరీ అనంతరం రూ.4లక్షల నుంచి రూ.8 లక్షల వార్షికవేతన ప్యాకేజీ పొందనున్నారని తెలిపారు. జాబ్ మేళాలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాసరావు, ఎంఎస్ స్కైర్ టెక్నాలజీస్ కంపెనీ మేనేజర్స్ పి.సాయిసంతోష్, పి.మణికంఠ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సిహెచ్ తరుణ్, హెచ్‌ఆర్ ఎస్.జ్యోత్స్న, ఎ. నవ్య, ఎ.ఎ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎడిఇ.రాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ జి.కమలరాణి, మెంబర్స్ కెఎస్ఆర్ రాజేష్‌రావు, ఎం.వి.నాగమణి, డి.సింహాచలం, డి.భవాని, ఎస్.కామేశ్వరి పాల్గొన్నారు.

పర్యాటకం ముసుగులో అడ్డగోలు దోపిడీ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖలో టూరిజం ముసుగులో గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా దోచుకున్నారని జనసేనకార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం పౌరగ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పర్యాటకం పేరుతో వైసిపి నాయకులు ఇష్టానుసారంగా వేల కోట్లు దోచుకుని తిన్నారన్నారు. రుషికొండ ఎదురుగా బేవాచ్‌ను తమకు అడ్డాగా మార్చుకున్న వైసిపి నేతలు, అక్కడ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించారని చర్చ జరుగుతోందన్నారు. దీనికి సంబంధించి ఒడిశా వ్యక్తికి కాంట్రాక్టు అప్పగించడం దారుణమన్నారు. దీనిపైజిల్లా కలెక్టర్‌కు, టూరిజం మంత్రి కందుల దుర్గేశ్‌కు వివరించానన్నారు. స్పందించిన మంత్రి తగు చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారని మూర్తియాదవ్ వెల్లడించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



జెడ్‌సికి ఆర్థిక సాయం అందజేస్తున్న డ్వాక్రా మహిళలు

డ్వాక్రా మహిళల ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగువార్డుల్లోని 16 వందల డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న సభ్యులు విజయవాడ వరద బాధితులకు తమవంతుగా రూ.1,06,576 ఆర్థిక సాయం అందజేసినట్లు యుసిడి ఎపిడి వై సంతోష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు జెడ్‌సి కె కనక మహాలక్ష్మి ద్వారా ప్రభుత్వానికి చెక్కు రూపంలో సాయం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో 2,3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు

ఆనందపురం : మండలంలోని నీలకుండీల లోని శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు తాము దాచుకున్న డబ్బులను వరద బాధితులకు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వారిని అభినందిస్తూ, చిన్నతనంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన పెద్దయ్యాక విద్యార్థుల్లో సేవా దృక్పథం ఏర్పడుతుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లెంక సురేష్ మాట్లాడుతూ, సేకరించిన డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్లు వెల్లడించారు.



దాచుకున్న డబ్బులను వరద బాధితులకు ఇస్తున్న వివేకానంద విద్యార్థులు

'ఆదర్శ' సాయం అభినందనీయం

గాజువాక : విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా గాజువాక ఆదర్శ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు సమకూర్చిన రూ.1,07,672ల ఆర్థికసాయం చెక్కును శుక్రవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తన కార్యాలయంలో అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో స్పందించిన పాఠశాల యాజమాన్యం ఈ మేరకు విరాళాల సేకరణ చేపట్టి, తమ ఔదార్యాన్ని చాటుకుంది. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు, ఆపద సమయంలో మానవత్వం చూపుతూ సాయం చేసేందుకు ముందుకొచ్చిన దాతల స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. ఆదర్శ పాఠశాల ఉదారతను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పవలూరి ప్రభ, పిన్సిపాల్ నేమాని గీత, ఒశీ కిషోర్, నేమాని జగన్, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరిపడా వర్కర్లు, సౌకర్యాలు లేకుండా

అదనపు కౌంటర్లు ఎలా పెట్టాలి?

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి

ప్రజాశక్తి-చోడవరం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించడానికి 100 మంది విద్యార్థులకు ఒక కౌంటర్ పెట్టాలని ప్రభుత్వ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో, పాఠశాలల్లో హెచ్ఎంలు ఒత్తిడి తీసుకొచ్చి కచ్చితంగా ఐదారు కౌంటర్లు ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేస్తున్నారని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి అన్నారు. సరిపడా వర్కర్లు, వంట పాత్రలు లేకుండా అన్ని కౌంటర్లు ఎలా పెట్టాలని ఆమె ప్రశ్నించారు. ఇలా పెట్టడం వల్ల కార్మికులు ఎంత ఆందోళన చెందుతారో కనీస ఆలోచన లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పొమ్మనకుండా పొగ పెట్టే పద్ధతిలో వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఒకవైపు వర్కర్లను కుదిస్తూ, 9, 10 తరగతులకు వంట చేస్తున్న కార్మికులకు వేతనం కూడా చెల్లించడం లేదన్నారు. ప్రతి హైస్కూల్కి ముగ్గురు లేదా నలుగురు కార్మికులను మాత్రమే ఇస్తూ ఆరు కౌంటర్ల ద్వారా సుమారు 18 మంది చేసే పని ఎలా చేస్తారని ప్రశ్నించారు. శానిటేషన్ కార్మికుల సహాయం తీసుకోవాలని చెబుతున్నారని, వాస్ రూమ్స్ క్లీన్ చేసే వాళ్ళు పిల్లలకు భోజనం ఎలా వడ్డిస్తారన్నారు. ఇలాంటి రకరకాల పని పద్ధతులను తీసుకొస్తే కార్మికులు ఎంత ఇబ్బంది పడాల్సి వస్తుందో కనీసం అర్థం చేసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సదుపాయాలు లేకుండా రకరకాలుగా పని ఒత్తిడికి గురిచేస్తూ పథకాన్ని నీరు గారిచే కుట్ర ప్రభుత్వం, అధికారులు చేస్తున్నట్లు తేటతెల్లమవుతుందన్నారు. ఇప్పటికైనా వందలాది మంది విద్యార్థులకు వంట చేస్తున్న కార్మికుల శ్రమను అర్థం చేసుకుని జిల్లా అధికారులు, ప్రభుత్వం సరైన ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఆర్.బుచ్చి రాజమ్మ, బి.లక్ష్మి, మంగమ్మ హసీనా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గూనూరు వరలక్ష్మి, చిత్రంలో మిడ్డేమీల్స్ కార్మికులు



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్ దగ్గర కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, అవార్డు స్టాఫ్ యూనియన్ సంయుక్తంగా జరిపిన 20 అంశాలపై జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ రెండు యూనియన్లు కలిసి ఈ సెప్టెంబర్ 27వ తారీఖున సమ్మె చేయడంతో పాటు రోజువారి నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందని యూనియన్ జాయింట్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీదేవి, శిరీష, రోజాశ్రీ, ఆడారి రాము, మాలతి, ఆఫీసర్స్ భవాని, బ్రాంచ్ మేనేజర్ రమేష్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామాదేవికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ కొన్ని పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో సిబ్బంది, అధికారులు విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారనే దానిపై పర్యవేక్షించాలని కోరారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

వైసిపి 80వ వార్డు ఇన్ఛార్జిగా కెఎం.నాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవిఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ వైసిపి పార్టీని వీడడంతో ఆ వార్డు వైసిపి ఇన్ఛార్జిగా సత్యనారాయణ మూర్తి దేవస్థానం మాజీ చైర్మన్ కెఎం.నాయుడును వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ గురువారం నియమించారు. ఈ మేరకు అనకాపల్లి రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో జరిగిన 80వ వార్డు నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యుల సమావేశంలో కేయం నాయుడును అభినందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, నూకాంబిక దేవస్థాన మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, న్యాయవాది నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు వెంకటలక్ష్మి ఎంపిక

ప్రజాశక్తి- సబ్బవరం : మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వెంకట లక్ష్మి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లా టెన్ని కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన లంకెలపాలెం జెడ్పి హైస్కూల్లో జరిగిన సెలెక్షన్స్లో కె వెంకటలక్ష్మి (10వ తరగతి) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో జరుగు పోటీలలో వెంకట లక్ష్మి పాల్గొని ఆడుతుందని తెలిపారు. వెంకటలక్ష్మిని ఎంఈఓలు, పిడి అబ్దుల్ రెహమాన్, స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ శంకరావు, జ్యోతిశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రవీంద్రబాబుకు సత్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు తీసుకున్న బుచ్చయ్యపేట మండలం తురకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రవీంద్ర బాబును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు టివి. రమణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు

16 నుంచి సిపిఎం బైక్ యాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

ఫార్మా, సెజ్ కార్మికులకు భద్రతకై సిపిఎం రక్షణ బైక్ యాత్రను సెప్టెంబర్ 16 నుండి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ నెల 14 నుండి ఈ యాత్ర ప్రారంభించాల్సి ఉండగా, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణించిన కారణంగా 16వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొంది. జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత లేదని, కార్మికులందరూ ఆందోళన, అభద్రతా భావంతో వున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో ఫార్మా, సెజ్ కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం రక్షణ యాత్ర ఈ నెల 16న పాయకరావుపేటలో ప్రారంభమవుతుందని పేర్కొంది. ఈ యాత్ర నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక, అనకాపల్లి, పరవాడ మండలాల్లో పర్యటిస్తూ సెప్టెంబర్ 20న అచ్యుతాపురంలో ముగిస్తుందని తెలిపింది. ఈ సందర్భంగా సెప్టెంబర్ 20న అచ్యుతాపురంలో జరిగే బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని వెల్లడించింది. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ప్రభుత్వాల పటిష్ట చర్యలకై సిపిఎం నిర్వహిస్తున్న యాత్రలో కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని, ఈ నెల 20న జరిగే బహిరంగ సభను కూడా జయప్రదం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది.


విశ్వేశ్వరయ్యను నేటి ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా చేసుకుని పని చేయాలని ఎన్ఎస్టిఎల్ అవుట్ స్టాండింగ్ సైంటిస్ట్, డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగేసే అన్నారు. స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో 57వ ఇంజనీర్స్ డే వేడుకలను కళాశాల స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ అబ్రహం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి భార్గవి మాట్లాడుతూ ప్రపంచంలో రష్యా తరువాత భారత దేశం ఎక్కువ మంది ఇంజనీర్లు అందిస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డైట్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఇంజనీర్ అంటే సివిల్ ఇంజనీర్ మాత్రమే గుర్తుకువచ్చే విధంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిస్వార్థంగా దేశానికి సేవలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సెమిస్టర్ అకాడమిక్ టాపర్లకు 20 గ్రాముల వెండి మెడల్ బహూకరించారు. బెస్ట్ లైబ్రరీ యూసర్ అవార్డులను కూడా విద్యార్థులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐ.ఈ.ఐ కన్వీనర్ వై హేమంత్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, సివిల్ ఇంజనీరింగ్ ఉప విభాగాధిపతి గంగాధర గుప్తా, వివిధ ఇంజనీరింగ్ విభాగ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎసెన్షియా బాధితునికి వైసిపి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- కశింకోట

ఆగస్టు 21న అచ్యుతాపురం సెజ్లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ జరిగిన ప్రమాదంలో గాయపడిన కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గంగాధర్కు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అందజేసిన 1 లక్ష రూపాయల చెక్కును శుక్రవారం ఆ పార్టీ నాయకులు అందజేశారు. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలశాల కిషోర్, తీడ గ్రామ సర్పంచ్ చిరికి సత్య నారాయణ పాల్గొన్నారు.



గంగాధర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నేతలు

జాతీయ తెలుగు వెలుగు నంది సేవా పురస్కారానికి బల్ల ఎంపిక



ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ సంఘ సేవకులు, సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం జాతీయ తెలుగు వెలుగు నంది సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 15న విజయవాడలో విజయవాడ కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా బాలోత్సవ్ భవన్లో ఈ అవార్డును అందించనున్నారు. ఈ సందర్భంగా బల్లా నాగ భూషణాన్ని స్థానిక సేవా సంస్థలు, సాహితీ, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు అభినందించారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : ఇటీవల భారీ వర్షాలు కారణంగా స్థానిక ద్వారకా నగర్లో ముంపునకు గురైన బాధితులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. కాలేజీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది విరాళాలు సేకరించి ఈ కాలనీలో పూరి గుడిసెల్లో జీవిస్తున్న 55 మందికి ఒక్కో కుటుంబానికి ఐదు కేజీల బియ్యం, అరకేజీ కందిపప్పు, అరకేజీ గోధుమ రవ్వ ఇన్చార్జి ఐవివి సత్యవతి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్లీలత, గొడవలు లేకుండా వినాయక నిమజ్జనాలు చేసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : అశ్లీలత, గొడవలు లేకుండా సామరస్య పూర్వకంగా వినాయక నిమజ్జనాలు జరుపుకోవాలని చోడవరం సిఐ పి.అప్పలరాజు కోరారు. మండలంలోని సగానికి పైగా వినాయక నిమజ్జనాలు జరిగాయని, మరికొన్ని విగ్రహాలు నిమజ్జనానికి ఉన్నాయని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నిమజ్జనం చేసేటప్పుడు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎటువంటి రికార్డింగ్ డ్యాన్స్లు, హిజ్రాలతో కార్యక్రమాలు నిర్వహించరాదని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రేస్ డ్రైవింగ్, లైసెన్సు లేని వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఇ-క్రాప్ నమోదు పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దమదిన గ్రామంలో జరుగుతున్న ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి బి భాస్కర రావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులకు ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా వచ్చే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీలోగా పంట నమోదుతో పాటు, ఈకేవైసీ కూడా పూర్తి కావలసి ఉందని చెప్పారు. మండలంలో 14 వేల ఎకరాలు ఈ పంట నమోదు చేయవలసి ఉండగా, ఇప్పటివరకు 9600 ఎకరాలలో మాత్రమే పంట నమోదు జరిగిందన్నారు. నమోదు కాబడిన విస్తీర్ణంలో 36శాతం వరకు ఈకేవైసీ పూర్తి అయిందన్నారు. తుది గడువు సమీపిస్తున్నందున రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మహేశ్వరి పాల్గొన్నారు.

రహదారి గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-సబ్బవరం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పినగాడి జంక్షన్ నుండి కె కోటపాడు ఆర్ అండ్ బి రోడ్డులో భారీ గుంతలు పడ్డాయి. నీరు నిల్వ ఉండిపోవడం వలన గోతులు కనిపించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన వైసీపీ నాయకులు గండి రవి కుమార్, రవికుమార్ యువ సైన్యం 40 ఎంఎం పిక్క, ఇసుక, సిమెంట్‌తో శుక్రవారం గుంతలు పూడ్చారు. దీంతో పాదచారులకు, వాహనదారులకు కష్టాలు తీరినట్లు పలువురు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమములో మొగలిపురం గ్రామం ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వైస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, కర్రి ధనంజయ్, గురి ఫణింద్ర, సంపత్, వంశీ పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం

ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఈ-క్రాప్ పంటలు నమోదు చేసుకున్న రైతులంతా ఈకేవైసీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని అమృతపురం గ్రామంలో రైతు సేవ కేంద్రాన్ని సందర్శించి తుఫాను వలన జరిగిన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేసి గ్రామ కమిటీ, మండల కమిటీలతో ఆమోదించి వెంటనే జిల్లా కేంద్రానికి పంపించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య ,పి. భావన పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తామరబ్బ పంచాయతీ ఎల్ఎం.పురం గ్రామంలో మాజీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మొసలి పైడిరాజు గిరిజన క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామంలో వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా గిరిజన క్రీడాకారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ చదువులతో పాటు, క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ వంతు సోమన్న దొర, మొసలి తమ్మయ్య, వంతు దేవుడమ్మ, మాజీ సర్పంచ్ కథరాజు ఈశ్వరమ్మ, ముసలి గౌరమ్మ, చీడ కన్నలదొర, కదరాజ ప్రసాద్, మొసలి శ్రీను, మొసలి చంటి, జుత్తాడ దేవుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ విజయ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : టిడిపి కసింకోట మండల నాయకులు, జీ.భీమవరం మాజీ సర్పంచ్ పచ్చికోర విజయ్ రామచంద్ర పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టిడిపి తాళ్లపాలెం కమిటీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్, అచ్చర్ల కమిటీ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు, జెర్రిపోతుల నూకునాయుడు సాలువతో సత్కరించారు. కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ అంద్రా ప్రసాద్, నక్క సాయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖరరావు, ఇంచార్జి ఈఓపిఆర్‌డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావుతో కలిసి పరిశీలించారు. ఎటువంటి అంటువ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నం వెంకటరావు, బొబ్బిలి రాము, సచివాలయం సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పద్యపఠనంలో గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : తెలుగు భాష దినోత్సవం -2024 సందర్భంగా భీమునిపట్నం డైట్ కాలేజీ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, 9వ తరగతి విద్యార్థులకు పద్యపఠనం పోటీలు నిర్వహించగా మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థి కె. పూర్ణబాబు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఎన్. రామకృష్ణ తెలిపారు. ఆర్ జె డి విజయభాస్కర్, ఇతర అధికారులు విద్యార్థి పూర్ణబాబు, గైడ్ టీచర్ రఘురాము నాయుడును, ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు టీచర్ ఐసాక్, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, రాంబాబు, చిరంజీవిరావు, తిరుపతిరావు, జానకిరామ్, సాయిరాం, లక్ష్మనరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారంతో దోమతెరల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా జిల్లాలో ఉచితంగా దోమతెరలు పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. కలెక్టర్ పిలుపుమేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అచ్యుతాపురం మెస్సర్స్ టయోస్సు రేర్ ఎర్త్స్ కంపెనీ 10 వేల దోమతెరలను ప్రభుత్వ యంత్రాంగానికి అందజేశారు. పరవాడ జేఎన్ఫిసి ఫార్మాసిటీ అరబిందో లేబరేటరీస్ 2,500 దోమతెరలను అందజేసింది. జిల్లాలో 30 వేల దోమతెరల పంపిణీకై వివిధ పరిశ్రమల యాజమాన్యాలను కోరడం జరిగిందన్నారు. అందులో భాగంగా గత వారంలో 10 వేల దోమ తెరలను బీసీ/ ఎస్సీ/ ఎస్టి/ హాస్టల్స్‌లో విద్యనభ్యసించే విద్యార్థులకు, గిరిజన మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. దోమ తెరలను కంపెనీల హెచ్ఆర్, మేనేజర్లు మురళీధరరావు, రామకృష్ణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి బి దయానిధి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్‌లకు అందజేశారని కలెక్టర్ పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు సహకారంతో త్వరలో మరిన్ని దోమతెరలు పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామని చెప్పారు.



దోమతెరలను అందజేస్తున్న పరిశ్రమల యాజమాన్యం

బాలికను ఢీకొట్టి పరారైన వాహనం గుర్తింపు

కొత్తకోట సిఐ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తకోట



మాట్లాడుతున్న సిఐ

బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి బిఎన్ రోడ్డులో బాలికను ఢీ కొట్టి పరారైన వాహనాన్ని 24 గంటల్లోగా గుర్తించామని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు..ఈ నెల 11 న బుధవారం సాయంత్రం కొమల్ల పూడి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన గొన్నా షర్మిల (6) మృతి చెందిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుచ్చయ్యపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని చెప్పారు. బాలిక మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించడానికి రోలుగుంట, రావికమతం, బుచ్చయ్యపేట, కొత్తకోట, ఎస్సైలతో నాలుగు టీమ్ లు ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ పంపిన మరొక టెక్నికల్ టీమ్ ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయడంతో ఈ ఐదు బృందాలు బుధవారం రాత్రి నుంచి పలు చోట్ల సిసి పుటేజ్ లను విచారణ చేయగా గురువారం సాయంత్రానికి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించగలిగామని సిఐ వివరించారు. నర్సీపట్నం మండలం గుండుపాల గ్రామానికి చెందిన డ్రైవర్ మర్ర రెడ్డిమయ్య (36) గా గుర్తించామని సిఐ తెలిపారు.పరారైన వాహనం చినపాచిల మీదుగా మాడుగుల మండలం ఘాట్ రోడ్డు మీదుగా పాడేరు చేరుకున్నాడని అక్కడి నుంచి లోతుగెడ్డ నుంచి గొలుగొండ మండలం గుండుపాల స్వగ్రామం గ్రామానికి చేరుకొని సరుగుడు తోటల మధ్యలో వాహనాన్ని నిందితుడు నిలిపి వేశాడన్నారు. ప్రమాద సమయంలో ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వాహనం రంగు ఆధారంగా సిబ్బంది నిర్వహించిన దర్యా ప్తులో తేలిందని చెప్పారు. బాలిక ను ఢీకొట్టిన తరువాత ప్రథమ చికిత్స చేయించేందుకు ప్రయత్నించానని, భయంతో పరారయ్యానని నిందితుడు అంగీకరించడాని సీఐ కోటేశ్వరావు తెలిపారు. కేసును 24 గంటల్లోగా చేదించినందుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ సీఐతో పాటు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

చిన్నచూపు చూడడం వల్లే వైసిపిని వీడా

కె.కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని

ప్రజాశక్తి-కె.కోటపాడు : దళిత సర్పంచ్ అయిన తనను చిన్నచూపు చూడటం వలన తాను వైసిపిని వీడవలసి వచ్చిందని కె.కోటపాడు మేజర్ పంచాయితీ సర్పంచ్ ఎర్రం శెట్టి భవాని అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం గ్రామ సర్పంచిగా దళిత స్త్రీ అయిన తనకు అధికారం చేపట్టే అవకాశం వచ్చిందని తెలిపారు. అయితే వైసిపి నాయకులు, ప్రస్తుత ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ తనకు అనారోగ్యంగా ఉందని బలవంతంగా మెడికల్ సర్టిఫికేట్ పెట్టించి సర్పంచ్ అధికారాన్ని తన చేతిలోకి తీసుకొని గత మూడున్నరేళ్లగా పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. తమకు ఇచ్చిన మాటను తప్పి దళితులుగా తమను చిన్నచూపు చూసిన ఆయన్ను తాము ఎప్పుడో వదిలేసామని పేర్కొన్నారు. వైసిపి తనను సస్పెండ్ చేయడం కాదని, తానే ఆ పార్టీకి గుడ్ బై చెప్పానని తెలిపారు. గ్రామ సచివాలయంలో కూర్చోవడానికి కుర్చీ కూడా తనకు లేకుండా చేశారని వాపోయారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ తన భార్య రెడ్డి అరుణని ఉప సర్పంచ్‌గా పెట్టి ఎంపీపీగా తన పదవిని అడ్డం పెట్టుకొని తమను అన్ని రకాలుగా మోసం చేశారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి అండదండలతో రెడ్డి జగన్మోహన్ తన పదవిని, తనను, అణగదొక్కారని వాపోయారు. తమ ఇష్ట ప్రకారంగా తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, స్థానిక మాజీ సర్పంచ్ డోకల లక్ష్మి నరసింహమూర్తి నాయకత్వం నచ్చి తాము టిడిపిలో చేరినట్లు చెప్పారు.

17న నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కొత్తకోట : కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ నులిపురుగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాదికారులు రజని, సురేఖ,మాట్లాడుతూ, గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలతో పాటు పాఠశాలలలో చదువుతున్న బాల, బాలికలకు యువకులకు ఈ నులి పురుగుల మాత్రలు అందించే కార్యక్రమం ఈ నెల 17న జరుగుతుందని వారు వివరించారు. ఇవి వేసుకోవడంతో మల బద్ధకము, రక్తహీనత లేకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌ఎస్ రమణ పాల్గొన్నారు.

నక్కపల్లి : ఈనెల 17న నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు స్కూల్లో,అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల్ని పంపిణీ చేయాలని ఇన్చార్జ్ ఎంపీడీవో సీతారామరాజు, గొడిచెర్ల పి హెచ్‌సి వైద్యాధికారి శ్రావణి సంధ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.గోడ పత్రికలు ,కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓపిఆర్‌డి సత్యనారాయణ ,వైద్య సిబ్బంది శ్రీనివాసరావు ,లక్ష్మణరావు ,మూర్తి తదితరులు పాల్గొన్నారు .

కాంట్రాక్టు నర్సుల నిరసన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : తమను రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్టు నర్సులు శుక్రవారం విశాఖ నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎనిమిది రోజులుగా తాము ఉద్యమబాటలో ఉన్నామని పేర్కొన్నారు. వారినుద్దేశించి ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు మాట్లాడారు. నాయకులు కె.సూర్యకళ, రాష్ట్ర కార్యదర్శి టిజిఎస్ఎన్.కుమారి, జి.శాంతమ్మ, కె.మణి పాల్గొన్నారు. తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు.

కె.కోటపాడు : జీఓ నెంబరు115ను రద్దు చేసి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని స్థానిక 50పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న పలువురు స్టాఫ్ నర్సులు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని కోరారు. ఈ మేరకు శుక్రవారం చౌడువాడలో ఆయనకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ఎం.ధనరాజ్యలక్ష్మి, కె.అప్పలనరస, పుష్పకళ, కె.రేవతి, దివ్యసత్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సెక్టార్ స్థాయిలో పౌష్టి కాహారంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మగవాళ్ళతో సమానంగా ఆడవాళ్లు పోటీపడి రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ మంగతాయారు, సూపర్ వైజర్స్ సుశీల, రాములమ్మ, కళ్యాణి, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం అంగన్వాడీ కేంద్రం-1 వద్ద పోషణ మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీలో ఇస్తున్న వాటిని సద్వినియగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం పోలీస్ గీత, సూపర్ వైజర్ సుచిరిత, అంగన్వాడీ కార్యకర్త కే.ధనలక్ష్మి పాల్గొన్నారు.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వింత వాతావరణం ఏర్పడింది. ఉదయం నుండి విపరీతమైన ఎండాకాలంతో ప్రజలు విలవిలాడారు. పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు ఎండ తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎండ కాస్తూనే వర్షపు చినుకులు పడ్డాయి. రంగు రంగుల ఇంద్ర దనస్సు ఏర్పడింది. చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి తదితర గ్రామాల్లో కొంతమంది యువకులు తమ సెల్‌ఫోన్‌లో ఇంద్రధనస్సును బంధించి ఆనందించారు.

టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి పాస్ అయి 15 సంవత్సరాల నిండిన వారు ఇంటర్మీడియట్లో చేరేందుకు అర్హులని, దరఖాస్తు apopen-school.ap.gov.in వెబ్సైట్ ద్వారా చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 15 తేదీలోగా, 200 రూపాయల అపరాధ రుసుముతో ఈనెల 25 లోగా చెల్లించి ఆన్లైన్లో సబ్మిట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు పైన తెలిపిన వెబ్సైట్ను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్యపై ..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో గడిచిన పక్షం రోజులుగా తాగునీటి ఇక్కట్లు నెలకొనడంతో శుక్రవారం కోటవురట్ల1 సచివాలయాన్ని గ్రామస్తులు ముట్టడించారు. ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టి నినాదాలు చేశారు. గ్రామంలో తాగునీరు అందకపోవడంతో అధికారుల తీరు పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా వరాహనది ప్రవహించే సమయంలో నది అవతల పంపు హౌస్ ఉండడం నది ఉధృతికి పైపులైను తెగిపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం సమయంలో నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. గ్రామంలో జల జీవన్ మిషన్ పైపులైను అలంకారప్రాయం మారిందన్నారు. గ్రామంలో శాశ్వత పరిష్కారం లేక నీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంన్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాధుడే లేడని వారు వాపోయారు. నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని, మంత్రి ఇలాఖాలో తాగునీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం సెలవులో ఉండడంతో నిరసనకారులకు ఫోన్‌లో మాట్లాడుతూ, శనివారం నాటికి తాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



సినిమా హాలు దిగువ ప్రాంతం అంతా తాగు నీటి కోసం ప్రతి ఏటా ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. తప్పని పరిస్థితిలో తాగు నీటి సమస్య పరిష్క రించాలని నిరసన చేపట్టాం.

పి.సుజాత

ప్రతి ఏటా సమస్యే...



వర్షాకాలం వచ్చిందంటే ప్రతి ఏటా ఇదే సమస్య ఎదుర్కోవాల్సి వస్తుంది. నాయకులకు ఓట్ల మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల మీద లేదు. కనీసం తాగునీరు అందించేందుకు కూడా నాయకులు, అధికారులు దృష్టి సారించకపోవడం దారుణం.

పేరూరి భవాని



జిమ్‌లో వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

డిగ్రీ కళాశాలలో జిమ్ పరికరాల పునరుద్ధరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం అల్లూరి సీతారామ రాజు డిగ్రీ కళాశాలలో ఉన్న వ్యాయమశాల పరికరాలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏర్పాటు చేయించారు. సరైన నిర్వహణ లేక ఆ పరికరాలు నిరూపయోగంగా మారాయి. ఇటీవల కళాశాలను సందర్శించిన స్పీకర్ అయ్యన్న నిరూపయోగంగా ఉన్న వ్యాయామశాల పరికరాలను చూసి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించడంతో పరికరాలను సిద్ధం చేయించారు. దీంతో స్థానిక యువతకు, విద్యార్థులకు మళ్ళీ వ్యాయమం చేసేందుకు సదుపాయం లభించింది.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అయ్యన్న

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 తేదీన గాంధీ జయంతి సందర్భంగా మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్, యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆయన స్వగృహంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ యువతరంలో ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గ్రీన్ క్లబ్ (నర్సీపట్నం) ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఓజోన్ పొర ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో డివిజన్ స్థాయిలో గల వివిధ మండలాల నుండి సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు ప్రధమ, ద్వితీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతి కూడా 16వ తేదీన నిర్వహించాల్సిన ర్యాలీలో ఆర్డీవో జయరాం చేతుల మీదుగా బహుమతులు ఇవ్వడం జరుగుతుందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు డి.గోపీనాథ్ తెలియజేశారు.

ఇసుకను ఉచితంగా అందించండి

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పరిధిలో గల గబ్బాడ రెవెన్యూలో ఉన్న ఇసుక యార్డులో ఉన్న ఇసుకను విచార చేసి నియమ నిబంధనల ప్రకారం కొత్త ప్రభుత్వ హామీ ఇచ్చిన మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో భవన నిర్మాణ రంగానికి సంబంధించి ఇసుక ప్రతీ ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా రూప కల్పన చేశామన్నారు. నియోజకవర్గంలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు రోజు వారి జీవితాన్ని గడపడనికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో భవనాలు నిర్మించుకునే వారు కూడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి గబ్బాడ ఇసుక యార్డులో నిల్వ ఉన్న వేలాది టన్నుల ఇసుకపై తగు విచారణ చేసి నిబంధనల ప్రకారం కొత్త ప్రభుత్వ హామీ ఇచ్చిన మేరకు ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా అందజేయాలన్నారు.



నినాదాలు చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు

బిఎన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలని..

కొత్తకోటలో ర్యాలీ, రాస్తారోకో

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రమాదకరంగా మారిన నర్సీపట్నం - చోడవరం బి ఎన్ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో ర్యాలీ,రాస్తోరోకో కార్యక్రమం విజయ వంతం అయ్యింది. తొలిత దొండపూడి ఫారెస్ట్ చెక్ పోస్టు నుంచి ఆటోలతో ర్యాలీ చేపట్టిన యూనియన్ సభ్యులు కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాల వద్ద గోతుల రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బుల్లిబాబు, సిహెచ్. నాగు, టి. శేఖర్, యు.సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ, నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే బిఎన్ రోడ్డు గత ఐదేళ్లుగా గోతులతో నిండి ప్రమాదకరంగా మారిందని వాపోయారు. ఇటు నర్సీపట్నం అటు చోడవరం వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలు, ఉద్యో గులు, ఈ రోడ్డు లో ప్రయాణం చేయడమంటే హడలి పోతున్నారని ఎక్కడ ఏ గొయ్యి ఎంత ఉందోనని ప్రాణ భయం తో మరో మార్గం లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత పాలకుల మాదిరిగానే ఈ పాలకులు కూడా ఏకంగా అభివృద్ధి చేయలేక చేతులు ఎత్తేసారని విమర్శించారు. ఈ రోడ్డులో ఏదో చోట రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు గురవు తున్నారన్నారు.పాలకులు స్పందించి కనీసం గోతులు పూడ్చే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



టైరు బళ్ల యజమానులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిబ్బంది

అక్రమ ఇసుక నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో రాజుపేట గ్రామం నుంచి ఇసుకను అక్రమ అక్రమ రవాణా జరుతుండగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఊర్ధవరావు, రెవెన్యూ అధికారులు రమేష్, అనూష సంయుక్తంగా దాడి చేసి ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. నధి నుంచి తీసుకు వచ్చిన ఇసుకను డంపింగ్ చేసి మాకవరపాలెం, నర్సీపట్నం మండలాలకు రాత్రి సమయంలో రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.




విద్యార్థులతో ఉపాధ్యాయులు

హైస్కూల్లో ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా హిందీ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా హెచ్ఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, పద్యాల పోటీలు నిర్వహించారు. 10 వ తరగతి విద్యార్థి నిఖిల్ సాయి సుధా వేసిన ఆర్ట్ ఎంతగానో ఆకట్టుకుంది .విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొని నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమం లో హిందీ ఉపాధ్యాయులు రమణి కుమారి, శ్రీనివాస్, ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ పాల్గొన్నారు.

ఎస్ఐ దివ్య బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సైగా టీ.దివ్య శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఉపేంద్ర యలమంచిల రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో దివ్య బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్సై మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



స్టీల్‌ప్లాంట్‌లో నివాళులర్పిస్తున్న అఖిలపక్ష కార్మిక నేతలు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి విశాఖ, అనకాపల్లిలో జిల్లాల్లో శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. ఏచూరి చిత్ర పటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు అన్నారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏచూరికి ఘననివాళు లర్పించారు. సభలో స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, స్టీల్ ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలపై పూర్తి అవగాహన ఉన్న ఏచూరి, బిహెచ్‌పివిని భెల్‌లోనూ, షిప్‌యార్డ్‌ను డిఫెన్స్‌లో విలీనం చేయడం వంటి కమిటీలకు ఛైర్మన్‌గా ప్రధాన భూమిక పోషించారన్నారు . స్టీల్ ప్లాంట్ ఉద్యమంలోనూ ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, నీరుకొండ రామచంద్రరావు, జె రామకృష్ణ, స్టీల్ అధికార సంఘం ప్రధాన కార్యదర్శి కెవిడి ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షులు భయ్యా మల్లయ్య, ఒబిసి అధ్యక్షులు బి అప్పారావు, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్, డివి రమణారెడ్డి, దాలి నాయుడు గుమ్మడి నరేంద్ర, జెర్రిపోతుల ముత్యాలు, శ్రీనివాస్ నాయుడు, రామ్‌కుమార్, మహాలక్ష్మి నాయుడు, పికె రెడ్డి, అట్టా అప్పారావు, పరంధామయ్య, శరత్, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి శ్రీనివాస్, స్టీల్ సిఐటియు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడే వ్యక్తి సీతారాం ఏచూరి

గాజువాక : పేదల పక్షాన నిలబడే వ్యక్తి సీతారాం ఏచూరి అని, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అన్నారు. గాజువాక సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జోన్ నాయకులు డి.లోకేష్ అధ్యక్షతన సంతాపసభలో మాట్లాడుతూ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా, ఇండియా కూటమిని ఏర్పాటులో ఏచూరి కృషి అమోఘమన్నారు. గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఎం రాజేంద్రప్రసాద్, డాక్టర్ రమేష్ కుమార్, కె.సంతోషం, యువివి వర్మ, కె.కిరీటం, పివైవి రమణారావు, బంగారునాయుడు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటు

మాధవధార : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు తీరనిలోటని సంతాప సభలో వక్తలు కొనియాడారు. కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎ.అజశర్మ మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ముందుకు సాగేందుకు తగిన సూచనలు ఇవ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా స్టీల్ ఉద్యమానికి మద్దతును కూడగట్టారన్నారు. జోన్ కార్యదర్శి బి. ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సంతాపసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, సీనియర్ నాయకులు ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.సుజాత, పి.రామారావు, కె. అనురాధ, బిఎన్ఆర్ ఫౌండేషన్ బాధ్యులు ఎస్.అప్పలరాజు, జోన్ కమిటీ సభ్యులు ఒమ్మి అప్పారావు,ఎం.ఈశ్వరరావు, ఓ. విజయ, ఎస్.శ్రావణ్, పార్వతి, కల్యాణి పాల్గొన్నారు.



నర్సీపట్నంలో...

పలుచోట్ల సంతాప సభలు


సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు ఎవ్ఎస్ఆర్ నగర్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు ఏచూరి చిత్రపటానికి జోన్ కార్యదర్శి రాజు,తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. జోన్ కమిటీ నాయకులు గౌరీష్, ప్రకాష్ రావు, అప్పలరాజు, మాధవి, లక్ష్మిపతి పాల్గొన్నారు.

గోపాలపట్నం : సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాపసభ నిర్వహించి, ఘన నివాళు లర్పించారు. సంస్కరణ సభలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్ మాట్లాడుతూ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కమ్యూనిస్ట్‌నేతగా సీతారాం ఏచూరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జ్యోతిశ్వరరావు, పి వెంకటరెడ్డి. బలివాడ వెంకటరావు, ఉరుకుటి రాజు, ముద్దాడ వరప్రసాద్, పి అనసూయ, ఎ.గోవిందరావు, లక్ష్మిపతి పాల్గొన్నారు.

ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ ఆధ్వర్యంలో వెంకన్నపాలెం పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆర్.దేవరాజు పూలమాలవేసి నివాళ్ళ అర్పించారు. మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నూకరాజు, రామారావు, సుధాకర్, లక్ష్మినారాయణ, తాతాజీ, జానీ, హుస్సేన్ పాల్గొన్నారు

జివిఎంసి 62వ వార్డు త్రినాథపురంలో బి.జగ్గునాయుడు, పి.రామారావు 63వవార్డు క్రాంతినగర్‌లో పి.సురేష్, చింతలోవలో కె.పెంటారావు ఏచూరి సంతాపసభలు నిర్వహించి, నివాళులర్పించారు. అర్జునరావు, కృష్ణ, అన్నపూర్ణ, వరలక్ష్మి, ఎన్.శ్రీను, దుర్గాప్రసాద్, నరేష్, ఎం.ఆదినారాయణ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక సిఐటియు కార్యాలయంలో సీతారా ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్, జోన్ కార్యదర్శి బి.రమణి, ఐద్వా నాయకురాలు అనంతలక్ష్మి, వెంకటలక్ష్మి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు మౌలాలి, సిఐటియు నాయకులు భాషా, సూర్య ప్రకాష్, అప్పారావు శంకరరావు, అప్పలనాయుడు, రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం సీతారాం ఏచూరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.



నివాళర్పిస్తున్న అజశర్మ, తదితరులు

సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యాన..

విశాఖ కలెక్టరేట్ : సీతారాం ఏచూరి నిబద్ధతగల మార్క్సిస్టు మేధావి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు అన్నారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయానికి సిపిఐ, ఎఐటియుసి నాయకుల బృందం ర్యాలీగా వచ్చి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించింది. ఏచూరి మరణం దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, సిఎన్.క్షేత్రపాల్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు, జి.పోలేశ్వరరావు, ఎం.ప్రదీప్ కుమార్, వి.కృష్ణారావు, కెవిపి.చంద్రమౌళి, ఎం.సూరీడు, కె.సత్యన్నా రాయణ, జక్కాన సత్యన్నారాయణ, పోర్టు డిఎల్‌బి యూనియన్ నాయకులు లక్ష్మణరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి దేశ ప్రజలకు తీరని లోటని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రవి పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మాడుగుల:మండలంలో వమ్మలి పంచాయతీ కేంద్రంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్ర పటానికి సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, నాయకురాలు కె.భవాని పూలమాలలు వేసి నివాళులర్పించారు.వేచలపు నూకాలమ్మ, పెద దేముడు, కుమారి, రాములమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడారు. సీపీఐ రావికమతం మండల కార్యదర్శి జి.జోగిరాజు మాట్లాడుతూ, కమ్యూనిస్ట్ మేధావి నేల కొరిగాడన్నారుఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి రమణాజి, గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, రాజునాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలో కొనాం పంచాయతీలో గుంటి కొత్తూరు గ్రామంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు సిపిఎం మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు, నాయకులు శ్రీరామ్, శ్రీనివాసరావు, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :స్థానిక సిఐటియు కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి శుక్రవారం సిఐటియు, ఐద్వా నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళ్ళన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్. గౌరి, ట్రెజరర్ కెవి సూర్యప్రభ, శామ్రిక మహిళ సంఘం నాయుకులు కెవి సూర్యప్రభ, కె.ప్రసన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అద్యక్షులు జి గీతాకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ రాయవరం:మండలంలోని అడ్డరోడ్డులో ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి అనకాపల్లి ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, సంఘం నాయకులు కాపుశెట్టి అప్పారావు, భీసెట్టి అప్పారావు, కె.రాజు, బి.రాజు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం పట్ల సిపిఐ అనకాపల్లి శాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, మత్తుర్ధి సూరిబాబు, ముక్కామల చిన్ని, దొడ్డి సూర్యారావు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలం కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. నాయకులు ఎన్ నారాయణరావు, సిహెచ్ శివాజీ, సిహెచ్ రామకృష్ణ, సిహెచ్ నూకన్న, బద్ది భాస్కరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : రామన్నపాలెం గ్రామంలో గిరిజనులు సంతాప సభ నిర్వహించి ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి. శంకర్, పొట్టంగి భీమన్న దొర, కాశి సుధాకర్, బిటి.దొర, మహిళలు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ఉషోదయ విద్య సంస్థలో సీతారాం ఏచూరికి ఘనమైన నివాళులర్పించారు. ఉషోదయ విద్యాసంస్థల ఛైర్మన్ జె.రమణాజీ ఏచూరితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంత బయలు వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఎస్ సంతోష్, వి రవి, ఎస్ కృష్ణ అప్పారావు, సిహెచ్ గణేష్, కే అప్పారావు, పి అప్పలరాజు పాల్గొన్నారు.

మునగపాక : సీతారాం ఏచూరి మరణానికి సంతాపంగా శుక్రవారం సిపిఎం ఇతర ప్రజాసంఘాల నాయకులు మునగపాక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలోనూ, తోటాడలోని సుందరయ్య గ్రంథాలయం వద్ద ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, ఆళ్ళ మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్కలి జగప్పారావు, పి జోగినాయుడు, దాడి రమణ బాబు, పి భాగేశ్వరరావు, రాపేటి పరమేష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఐ, ఎఐటియుసి, సిపిఎం నాయకులు

కె.కోటపాడు : సీతారం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి దేశానికి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా నాయకులు గండి నాయిని బాబు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలోనూ, గొండుపాలెంలోనూ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రొంగలి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అకాల మృతి పట్ల సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతతత్వానికి వ్యతిరేఖంగా పోరాడిన మహా నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.సత్యవతి, కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, ఎస్. గౌరీ, రమణమ్మ, ఉమ, దేముడమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సీతారాం ఏచూరి అకాల మరణం చింతిస్తూ అచ్చుతాపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కాంద్రేగుల రామ సదాశివరావు, కర్రి అప్పారావు, కె సోమునాయుడు, ఆర్.లక్ష్మి రామకృష్ణ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి చిత్రపటానికి హరిపాలెం గ్రామంలో శుక్రవారం ఏపీ విశాఖ గ్రామీణ బ్యాంకు పూర్వపు మేనేజర్ అందుకూరి రామ భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి బి సూర్యరామ్‌కుమార్, ఆదిబాబు, మణి కుసుమ రాము, రామ అప్పారావు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నివాళి

అచ్యుతాపురం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఒక వామపక్ష శిఖరం గా కీర్తించారు.

విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నేతల నివాళి

యలమంచిలి : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికే తీరని లోటని విద్యార్థులు అన్నారు. యలమంచిలి జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, గణేష్, కృప, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సీతారాం ఏచూరి మృతి పట్ల ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యాన స్థానిక కళాశాల వసతి గృహంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ, వెంకటి, కృష్ణవేణి, చలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో..